
ఆంధ్రజ్యోతి



జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
మంగళవారం 18 నవంబరు 2025

దరఖాస్తుల ఆహ్వానం

రాయికల్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని ఉప్పుమడుగు కస్తూర్బా గాంధీ పాఠశాలలో స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి రాఘవులు తెలిపారు. అభ్యర్థులు రాయికల్ మండల కేంద్రానికి చెందినవారై ఉండాలని, 7వ తరగతి ఉత్తీర్ణత సాధించి 18-45 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు ఈ నెల 19న సాయంత్రం వరకు దరఖాస్తులు సమర్పించాలని, వివరాలకు ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి 8008476752లో సంప్రదించాలని అన్నారు.

గ్రంథాలయంలో ఉపన్యాస పోటీలు

జగిత్యాల అర్బన్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా జగిత్యాల జిల్లా గ్రంథాలయంలో జిల్లాలోని కళాశాల, పాఠశాలల విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు రోజున బహుమతి ప్రదానం చేస్తామని గ్రంథ పాలకురాలు శకుంతల తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని గ్రంథపాలకులు కవిత, తరంగిని, సరోజ, అనిత, చందన, ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన మాలమహానాడు నాయకులు

జగిత్యాలరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల రూరల్ ఎస్సైగా నియమితులైన ఉమాసాగర్‌ను జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మాలమహానాడు ఆఫ్ ఇండియా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కులసంఘాలు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలసంఘాల జేఏసీ అధ్యక్షుడు మద్దెల నారాయణ, జిల్లా అధ్యక్షుడు చిత్తారి ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు తోట జగన్ తదితరులు పాల్గొన్నారు.



యాసంగి రుణ లక్ష్యం ఖరారు

- జిల్లాలో రూ.1,024 కోట్లు ఇవ్వాలని టార్గెట్
- 61,778 ఎకరాలకు రుణాలు అందించడానికి ప్రణాళిక
- బ్యాంకర్లు సకాలంలో అందిస్తేనే రైతులకు ప్రయోజనం

జగిత్యాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన యాసంగి పంట రుణాల లక్ష్యం ఖరారైంది. జిల్లాలో యాసంగి పంటలకు గాను 61,778 ఎకరాల్లో రూ.1,024 కోట్లు రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్దేశితమైంది. పంటల పెట్టుబడులకు రైతులు బ్యాంకులు అందించే రుణాలపైనే ఆధారపడ్డారు. బ్యాంకర్లు సకాలంలో రుణాలు అందిస్తేనే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. జగిత్యాల జిల్లా ప్రధానంగా వ్యవసాయ ఆధారిత జిల్లాగా గుర్తింపు పొందింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాలువలతో పాటు పలు ఎత్తిపోతల పథకాలు, చెరువులు, కుంటలు ఉన్నాయి. జిల్లాలో ప్రతీయేటా ప్రధానంగా వరి, మొక్కజొన్న, పసుపు, నువ్వు, సోయా, జొన్న తదితర పంటలతో పాటు మామిడి తోటల సాగు ఎక్కువగా ఉంటుంది.

రుణ లక్ష్యం నెరవేరితేనే ప్రయోజనం..

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి యాసంగి రుణ లక్ష్యాన్ని అధికారులు నిర్ణయించారు. సన్న, చిన్నకారు రైతులు ఎక్కువగా ఉన్నందున వీరికి పంట పెట్టుబడులకు బ్యాంకర్లు సకాలంలో రుణాలు అందిస్తేనే ప్రయోజనం చేకూరుతుంది. రైతు భరోసా, పీఎం కిసాన్ సమ్మాన్ యోజన లాంటి పథకాలు ఉన్న అవి పంట పెట్టుబడులను పూర్తిగా తీర్చడం లేదు. ఇక్కడి సన్న, చిన్నకారు రైతులు బ్యాంకులు అందించే పంట రుణాలపైనే ఆధారపడి సేద్యం చేస్తున్నారు. ఇదిలా ఉంటే యాసంగి సీజన్‌కు ఇంకా రైతు భరోసా అందించలేదు. అయితే సీజన్ మిగతా 8లో..

జిల్లాలో 3.95 లక్షల ఎకరాల సాగు అంచనా..

జిల్లాలో యాసంగి సీజన్‌లో సుమారు 3,95,555 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారన్న అంచనా ఉంది. ఇందులో ప్రధానంగా వరి పంటను సాగు చేయనున్నారు. జిల్లాలో వరి 3,02,600 ఎకరాలు, మొక్కజొన్న 35,000 ఎకరాలు, నువ్వులు 11,000 ఎకరాలు, మామిడి 38,300 ఎకరాలు, పల్లి 320 ఎకరాలు, జొన్నలు 2,300 ఎకరాలు, మిరప 750 ఎకరాలు, చెరుకు 190 ఎకరాలు, ఆయిల్ పామ్ 4,200 ఎకరాలు, పెసర, మినుము, ఆలసంద, అవాలు, కందులు తదితర పంటలు 895 ఎకరాల్లో సాగు అవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో పది నుంచి ఇరవై శాతం హెచ్చుతగ్గులు ఉండవచ్చన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులందరికీ పంట రుణాలు
రాంకుమార్, లీడ్ బ్యాంక్ మేనేజర్, జగిత్యాల

పంట పెట్టుబడుల్లో భాగంగా పంట రుణాలకు దరఖాస్తు చేసుకునే అర్హులైన రైతులందరికీ రుణాలు అందిస్తాం. రుణాలు పొందాలనుకున్న రైతులు తప్పక రెన్యూవల్ చేసుకోవాలి. దీనివల్ల రుణాలు అందించడానికి వీలు అవుతుంది. యాసంగి సీజన్‌లో లక్ష్యం మేరకు రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి — రాష్ట్ర పరిశీలకురాలు సులోచన 8

వైభవంగా గోదావరి హారతి — భక్తుల ప్రత్యేక పూజలు 7

కుటుంబ కలహాలతో భర్తను హతమార్చిన భార్య — తల్లి సహాయంతో గొంతుకు చున్నీ బిగించి హత్య 7

నాణ్యమైన భోజనం అందించాలి.. కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్



విద్యార్థులతో మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి టౌన్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ బాలుర పాఠశాలను సోమవారం కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రిజిష్టర్లు, రికార్డులను పరిశీలించి, ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. వంటశాలను పరిశీలించి, భోజనం నాణ్యతతో అందించాలని సిబ్బందికి సూచించారు. స్కూల్ ప్రాంగణం, హాస్టల్ గదులు పరిశీలించి, పరిశుభ్రతను పాటించాలని ఆదేశించారు. ప్రిన్సిపాల్‌తో మాట్లాడి స్కూల్‌లో ఖాళీల భర్తీ, బోధన నాణ్యత గురించి తెలుసుకున్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

కోరుట్ల: పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అందించారు. సోమవారంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.7,98,000 విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, మాజీ సర్పంచ్‌లు బాస్కర్ రెడ్డి, వనతడుపుల అంజయ్య, మాజీ కౌన్సిలర్లు సజ్జు, పెర్ల సత్యం, నాయకులు పహీం, సందయ్య, గంగాధర్, ప్రభు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం — వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్



సిరికొండలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కథలాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని సిరికొండలో సోమవారం ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతీ నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న పేదల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందన్నారు. ప్రజా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు వెళ్తోందని గుర్తు చేశారు. పల్లెల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు మరింత వేగం పెంచుకోవాలని సూచించారు. అనంతరం గంభీర్ పూర్‌లో మృతి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బూస చిన్న గంగారెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించారు. దూలూరులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సురేశ్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, ఏఎంసీ డైరెక్టర్ హఫీజ్, ఎగ్యారపు శ్రీహరి, అంబటి రాధాకృష్ణ ఉన్నారు.

బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు: ఎస్పీ అశోక్ కుమార్



పోలీసు కార్యాలయంలో బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

జగిత్యాల టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని జిల్లాలోని పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డే సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 8 మంది అర్జీదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడారు. ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా బాధితులకు న్యాయం జరిగేలా చూస్తున్నామని తెలిపారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

జగిత్యాల టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చలికాలంలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతుండటంతో ఉదయం, రాత్రి వేళల్లో రహదారులపై పొగమంచు అధికంగా ఏర్పడి రోడ్డు స్పష్టంగా కనబడక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహన చోదకులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. ఈ సందర్భంగా వాహనదారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. పొగమంచు ఎక్కువగా ఉన్నప్పుడు వాహన వేగం తగ్గించుకోవాలని, అవసరమైతే రోడ్డు పక్కకు ఆపి ఇండికేటర్లను ఆన్ చేయాలన్నారు. హెడ్‌లైట్లు, ఫాగ్‌లైట్లు ఆన్ చేసుకొని వెళ్లాలని, హెడ్‌లైట్లు హైబీమ్‌లో పెట్టకుండాలో బీమ్‌లో వాడలని, ముందు వాహనానికి సురక్షిత దూరం పాటించాలని సూచించారు. బైక్ రైడర్లు హెల్మెట్, కారు డ్రైవర్లు సీట్ బెల్ట్ పెటుకోవాలని, బస్సులు, లారీలు, ఆటోలు వంటి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు నడిపే డ్రైవర్లు ఇంకా జాగ్రత్తలు ఎక్కువగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రతి డ్రైవర్ ఓర్పు, అప్రమత్తత, నిబంధనలు పాటించడం ద్వారా చాల ప్రమాదాలు నివారించి అనేక ప్రాణాలను కాపాడవచ్చని ఎస్పీ సూచించారు.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల విధుల బహిష్కరణ
సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జగిత్యాల డిపోకు చెందిన అద్దె బస్సు డ్రైవర్లు బస్సులు తీయకుండా ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు, నాలుగు నెలలుగా తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము నెల రోజుల గడువు నిబంధన మేరకు తమ సెల్‌ఫోన్‌లను డిపోలో అప్పగించి విధులు నిర్వహించామని, నెల గడువు ముగిసినా సెల్‌ఫోన్‌లు అనుమతి ఇవ్వడం లేదని వారు పేర్కొన్నారు. అత్యవసర సమయంలో తాము, తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోందని డ్రైవర్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు అధికారుల ప్రవర్తన తమను మనోవేదనకు గురిచేస్తుందన్నారు. డిపోలో మొబైల్స్‌ను అప్పగించినా బస్టాండ్‌లలో తనిఖీల పేరుతో బస్ ఎక్కి ప్రయాణికుల ముందట చెకింగ్ చేస్తూ అవమానకరంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తమ సమస్యలను డిపో మేనేజర్‌తో పాటు ఇతర డిపో అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విధుల్లోకి వెళ్లేప్పుడు సెల్‌ఫోన్‌ను అనుమతించాలని, అలాగే ఫటల్ యాక్సిడెంట్ డ్రైవర్‌లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. బస్సుల్లో కెపాసిటీకి మించి ప్రయాణీకులను తరలించే పరిస్థితి ఉందని, ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే బాధ్యత సదరు బస్ డ్రైవర్ వహించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

వేకువజాము నుంచి నిరసన తెలు పుతున్న డ్రైవర్లను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తర లించారు. అధికారుల తీరుపై డ్రైవర్లు పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. ఇదే విషయంపై డీఎం కల్పనను వివరణ కోరగా ఉదయం 3గంటల నుంచి హైర్ బస్సు డ్రైవర్‌లు బస్సులు తీయకుండా నిరసన తెలిపారని, కానీ రాష్ట్రవ్యాప్తంగా 11 డిపోలలో మొబైల్ అనుమతి నిరాకరిస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారని అందులో భాగంగా జగిత్యాల డిపోలో పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేశారని తెలిపారు. మొబైల్ అనుమతి, ఫటల్ ఆక్సిడెంట్ తదితర అంశాలు తమ పరిధిలోని అంశం కాదన్నారు. ఉన్నతాధికారులకు సమస్యలు నివేదించామని, ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని డీఎం కల్పన పేర్కొన్నారు.

నేడు పెగడపల్లి మండలంలో మంత్రి అడ్లూరి పర్యటన

పెగడపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) :మండలంలో మంగళవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పర్యటించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ తెలిపారు. ల్యాగలమర్రి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశంలో పాల్గొనడంతో పాటు కళ్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనున్నట్లు తెలిపారు.

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ పరామర్శ

బీర్‌పూర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలో సోమవారం మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పలువురు బాధితులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ వెంట లింగన్న, శ్రీను, అశోక్, రవీందర్, మల్లేశం, సతీష్, తిరుపతి పాల్గొన్నారు.

108 అంబులెన్స్ తనిఖీ

జగిత్యాల అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలో ఉన్న నియోనాటల్, 108 అంబులెన్స్‌ను సోమవారం జగిత్యాల జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ జివి కృష్ణమూర్తి తనిఖీ చేశారు. అంబులెన్స్‌ను తనిఖీ చేసిన ఆయన అంబులెన్స్‌లో ఉన్న ఇన్క్యూబేటర్, వెంటిలేటర్, మల్టీఛానల్ మానిటర్‌తో పాటు ఇతర వైద్య పరికరాల పనితీరు, ఆక్సిజన్, అత్యవసర పరిస్థితుల్లో అవసరమయ్యే మందులను పలు రికార్డులను పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో అన్ని వేళల అందుబాటులో ఉండి మరింత మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీల్, అంబులెన్స్ జిల్లా మేనేజర్ ఆకోద అయిలయ్య, సిబ్బంది, చంద్రశేఖర్, కుమారస్వామి, సాగర్, మమత ఉన్నారు.

ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్



ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్ఆర్ఎస్పీ క్యాంపు శివారులో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈవీఎం గోదాంను సందర్శించి పరిశీలించారు. ప్రతీ నెల చేసే తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోదాంను కలెక్టర్ సత్య ప్రసాద్ సందర్శించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. సాంకేతిక పరమైన అంశాలను అడిగితెలుసుకున్నారు. గోదాం వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమైన భద్రత ఉంచాలని, నిత్యం అప్రమత్తతో పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి హకీం, జగిత్యాల అర్బన్ తహసీల్దార్ రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి



పటేల్ విగ్రహానికి పూలమాల వేస్తున్న భారత్ సురక్షాసమితి నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఐక్యత మార్చ్‌ను పురస్కరించుకొని సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంత్యుత్సవాల్లో భాగంగా భారత్ సురక్షాసమితి బాధ్యులు ఏపీఎస్ రాజు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని స్థానిక కొత్తబస్టాండ్ సర్కిల్ వద్ద గల పటేల్ విగ్రహానికి సోమవారం పూలదండ వేసి, నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పటేల్ చూపిన చొరవ వల్లనే నేడు సమైక్య భారతాన్ని చూడగలుగుతున్నామన్నారు. దేశంలోని 562 స్వదేశీ సంస్థానాలను ఇండియన్ యూనియన్‌లో విలీనం చేశారన్నారు. స్వాతంత్ర్యానంతరం భారతదేశానికి తొలి ఉపప్రధానిగా, హోం మంత్రిగా సేవలందించారని కొనియాడారు. నిజాం నిరంకుశ పాలనను సైనికచర్య ద్వారా తెలంగాణకు విముక్తి కల్పించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సమరసత వేదిక జిల్లా అధ్యక్షుడు చిట్ల గంగాధర్, సురక్షాసమితి బాధ్యులు వేముల పోచమల్లు, కార్యదర్శి సింగం గంగాధర్, బాశెట్టి ప్రభాకర్, కొత్తకొండ బాలన్న, నరేందుల శ్రీనివాస్ తదితరులున్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలి



వినతి పత్రం సమర్పిస్తున్న కాలనీవాసులు

రాయికల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని శివాలయంవాడలో సీసీ రోడ్డును నిర్మించాలని కోరుతూ కాలనీవాసులు సోమవారం మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. వర్షాల సమయంలో మట్టి, గుంతల్లో నీటి నిల్వలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందులుగా ఎదురవుతున్నాయన్నారు. గతంలో పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేదన్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులకు తక్షణమే మంజూరు చేసి ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు లక్ష్మీనారాయణ, శంకర్, రవి, అశ్విత, జలజ పాల్గొన్నారు.

ఆయిల్ పాం సాగుతో అధిక లాభాలు



మాట్లాడుతున్న ఏఈవో అనిల్

కొడిమ్యాల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పాం సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చునని హార్టికల్చర్ ఏఈవో అనిల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆయిల్ పాం సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఈవో మాట్లాడుతూ ప్రతి రైతు ఆయిల్‌పాం సాగువైపు మొగ్గు చూపాలని కోరారు. ప్రతి రైతు తనకు ఉన్న వ్యవసాయ భూమి నుంచి రెండు ఎకరాలైన ఆయిల్ పాం సాగు చేయటానికి ముందుకు రావాలన్నారు. ఆయిల్ పాం పంట ప్రాముఖ్యత, మార్కెటింగ్ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో కొడిమ్యాల సింగిల్‌విండో కార్యదర్శి వొడ్నాల గంగాధర్, ఫీల్డ్ ఆఫీసర్ లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత

రాయికల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపూర్ ఉన్నత పాఠశాల 2005-06 పూర్వ విద్యార్థులు చేయూతనందించారు. తాము చదువుకున్న పాఠశాలలో భోజన హాల్‌కు తలుపులు లేవని తెలుసుకుని రెండు ఇనుప తలుపులు చేయించి ఆదర్శంగా నిలిచారు. వీరిని హెచ్‌ఎం వెంకటరమణి అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తీగల విష్ణు, వెంకటకృష్ణ, విజయ్, వెంకటేష్, బాబాఖాన్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ జక్కుల రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతిచెందారు. వివరాల్లోకి వెళితే..

కారు.. బైక్‌ను ఢీకొట్టడంతో ఒకరు మృతి

జగిత్యాలరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలంలోని తిమ్మాపూర్ శివారులో ఆదివారం అర్ధరాత్రి బైక్‌ను కారు ఢీకొన్న సంఘటనలో బంక అరుణ్(23)అనే యువకుడు మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. జగిత్యాలరూరల్ ఎస్సై ఉమాసాగర్ కథనం ప్రకారం.. బుగ్గారం మండలం శెకల్ల గ్రామానికిచెందిన బంక అరుణ్ తనస్నేహితులైన అజయ్, విష్ణుతోకలిసి బైక్‌పై శెకల్ల గ్రామం నుంచి జగిత్యాల వైపు పనినిమిత్తం వస్తున్నారు. ఈ క్రమంలో జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ శివారులోగల చిన్నగుట్టు వద్ద గంగాధర ప్రాంతానికి చెందిన కారు వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొనగా బైక్‌పై వెనుక కూర్చున్న బంకఅరుణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. అజయ్, విష్ణు లకు తీవ్రగాయాలైనట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. వీరిని మెరుగైన చికిత్సకోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి బంక శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

● ఇద్దరి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది..

రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అజయ్, విష్ణులకు 108సిబ్బంది ఈఎంటీ మంచాల మానస, పైలట్‌రాజు అత్యవసర సమయంలో ప్రథమ చికిత్స నిర్వహించి తక్షణమే ప్రభుత్వఆస్పత్రికి తరలించి ఇద్దరి ప్రాణాలను కాపాడారు. బాధితకుటుంబసభ్యులు 108సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

బైక్‌ను టిప్పర్ ఢీకొట్టడంతో.. యువకుడి దుర్మరణం


శ్రీనివాస్(ఫైల్)

తిమ్మాపూర్ : మండలంలోని రామకృష్ణ కాలనీ వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో రాజీవ్ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో కళ్లెం శ్రీనివాస్(18) మృతిచెందాడు. ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం.. రామకృష్ణ కాలనీకిచెందిన కళ్లెం శ్రీనివాస్ ఐటీఐ చదువు తున్నాడు. సోమవారం స్థానిక శివాలయంలో పూజచేసేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈక్రమంలో హైదారాబాద్ వైపు నుంచి కరీంనగర్ వైపు అతివేగంగా వచ్చినటిప్పర్ బైక్‌నుఢీకొంది. దీంతో బైక్‌పై వెళ్తున్న శ్రీనివాస్ టిప్పర్ వెనక టైర్లకింద పడిపోయాడు. టిప్పర్‌టైర్లు శ్రీనివాస్ తలపై, ఛాతీపైనుంచి వెళ్లాయి. శ్రీనివాస్ తీవ్రగాయాలతో సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. శ్రీనివాస్ కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఏడేళ్లక్రితం శ్రీనివాస్ తండ్రి కూడా రామకృష్ణ కాలనీ వద్దే రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు.

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి

శంకరపట్నం: శంకరపట్నం మండలం తాడికల్ శివారులో జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాన్ని ఆటోఢీ కొట్టిన ఘటనలో తాడికల్ గ్రామానికి చెందిన గడ్డి గట్టయ్య(73) మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. తాడికల్ గ్రామానికి చెందిన గడ్డి గట్టయ్య తన ద్విచక్రవాహనంపై వ్యక్తిగత పని నిమిత్తం కేశవపట్నం వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో తాడికల్‌లోని ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వెనుకనుంచి ఆటోడ్రైవర్ వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో గట్టయ్య రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొని, పక్కనఉన్న ట్రాక్టర్ కల్టివేటర్‌పై పడ్డాడు. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. గట్టయ్య కూతురు కవిత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

కారు ఢీకొని సింగరేణి రిటైర్డ్ కార్మికుడు కన్నుమూత

పెద్దపల్లి రూరల్ : మండలంలోని రాఘవ పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లపల్లి స్టేజీవద్ద కారు ఢీకొని సింగ రేణి రిటైర్డ్ కార్మికుడు మృతిచెందాడు. పెద్దపల్లిరూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోదావరిఖని తిలక్‌నగర్‌కు చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు చొప్పల నాగరాజు(72) కుమారునితో సోమవారం పెద్దపల్లిలో కొనుగోలు చేసిన భూమిని చూసేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చాడు. గొల్లపల్లి స్టేజీ వద్ద వాహనాన్ని యూటర్న్ చేస్తున్న క్రమంలో గోదావరిఖని నుంచి పెద్దపల్లికి వస్తున్న కారు ఢీకొనడంతో నాగరాజు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారునికి గాయాల య్యాయి. సంఘటనస్థలాన్ని ట్రాఫిక్‌సీఐఅనిల్‌కుమార్, రూరల్‌పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్యలక్ష్మీ ఫిర్యాదుమేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లుఎస్ఐమల్లేష్ తెలిపారు.

కారు ఢీకొని మహిళ మృతి


బుచ్చవ్వ(ఫైల్)

తంగళ్లపల్లి : రోడ్డుపక్కన బస్సు కోసం వేచి ఉన్న మహిళను కారు ఢీకొట్టడంతో మహిళ మృతిచెందగా కారు డ్రైవర్ గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. తంగళ్లపల్లి మండలకేంద్రం ఇందిరానగర్‌కు చెందిన ముగ్దం బుచ్చవ్వ(55) కూరగాయలు విక్రయిస్తూ జీవనం గడుపుతోంది. సోమవారం తెల్లవారుజామున తంగళ్లపల్లిలోని బస్టాండ్ సమీపంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద బస్సు కోసం వేచి ఉండగా సిద్దిపేట వైపు నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. ఈ ప్రమాదంలో హైదరా బాద్‌కు చెందిన కారు డ్రైవర్ మోమన్ స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడ్డ వారిని 108వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించారు. బుచ్చవ్వ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కరీనంగర్‌కు తరలిస్తుండగా మృతిచెందింది. మృతురాలికి భర్త మల్లయ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి పడి జైలు వార్డెన్ దుర్మరణం

ఓదెల, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తారకరామ కాలనీ వద్ద ఉన్న 32వ రైల్వే గేటు సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద సోమవారం పరకాల సబ్‌జైల్ వార్డెన్ నాగపూరి రాకేష్ రైలు నుంచి పడి మృతిచెందాడు. వరంగల్ చింతలపల్లిలో నివాసముంటున్న రాకేష్ పెద్దపల్లిలో జరిగిన మిత్రుడి వివాహానికి హాజరయ్యాడు. అనంతరం తిరుగు ప్రయాణం కోసం కాజీపేట్‌కు వెళ్లేందుకు పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. రాకేష్ ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి అక్కడికక్కడే మృతిచెందాడు.


'షీ లీడ్స్' శిక్షణ తరగతులకు హాజరైన మహిళా కానిస్టేబుళ్లు


ధర్నాలు, నిరసనలు, ఆందోళనల సందర్భంలో నిరసనకారులను అడ్డుకోవడంలో శిక్షణ పొందుతున్న మహిళా కానిస్టేబుళ్లు

మహిళా కానిస్టేబుళ్లకు షీ లీడ్స్

● ఇప్పటికే బ్లూకోల్ట్స్ విధుల్లో మహిళా పోలీసులు
● కరీంనగర్‌లో పోలీసింగ్ సంస్కరణలు

కరీంనగర్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): 'మేమున్నాం' అనే ధైర్యాన్ని, భరోసాను మాటల్లో కాదు, చేతల్లో చూపిస్తున్నారు కరీంనగర్ పోలీసు కమీషనరేట్‌లోని మహిళా పోలీసులు. పోలీసు కమిషనర్ గౌస్ ఆలం ఆధ్వర్యంలో 'షీ లీడ్స్' శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇదివరకు మహిళా కానిస్టేబుళ్లు ఆఫీస్ విధులకే పరిమితమయ్యేవారు. విజిబుల్ పోలీసింగ్‌లో వారి భాగస్వాములను చేసేందుకు మహిళా కానిస్టేబుళ్లకు బ్లూ కోల్ట్స్ విధులు కేటాయిస్తున్నారు. ఈ విధానం ఇప్పటికే సత్ఫలితాలనిస్తోంది. ప్రజలకు భద్రతపై మరింత దృఢమైన నమ్మకాన్ని కల్పించడంలో మహిళా బ్లూ కోల్ట్స్ కీలకపాత్ర పోషిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో సంఘటనలు ఎదురైనప్పుడు సమర్థవంతంగా ఎదుర్కొనేలా మహిళా పోలీసులను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు 'షీ లీడ్స్' కార్యక్రమాన్ని రూపొందించి శిక్షణను ప్రారంభించారు.

● క్షేత్ర స్థాయి సమస్యలపై శిక్షణ...

పోలీస్ శాఖలో విధులు నిర్వహించేవారు శారీరక దృఢత్వంతో పాటు మానసికంగానూ దృఢంగా ఉండాలి. మహిళా పోలీసులు వారిని వారు రక్షించుకునే స్థితిలో ఉన్నప్పుడే ప్రజలను రక్షించగలరనే ఉద్దేశంతో వంద మందికి (షీ టీంల సభ్యులతో సహా) రెండు దశల్లో కరీంనగర్ కమీషనరేట్ కేంద్రంలో ప్రత్యేక శిక్షణను అందిస్తున్నారు. ఆత్మరక్షణ విద్యలో సుశిక్షితులుగా తీర్చిదిద్దడం కోసం కరాటే (అన్ ఆర్మ్ కంబాట్ కోర్స్)లో శిక్షణ ఇస్తున్నారు. దర్నాలు, నిరసనల్లో ముఖ్యంగా మహిళా నిరసనకారులను తరలించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సున్నితమైన అంశాలను ఎలా సమర్థంగా, మానవీయంగా నిర్వహించాలో నేర్పిస్తున్నారు. మానసిక ఒత్తిడి అధిగమించేందుకు, క్షేత్ర స్థాయి విధుల్లో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించేందుకు, పోలీసులకు మానసిక దృఢత్వాన్ని పెంచేలా ఈ శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించారు.

షీ లీడ్స్ కార్యక్రమంతో ప్రజలకు మరింత దగ్గరగా.

\- గౌస్ ఆలం, కరీంనగర్ పోలీస్ కమిషనర్



మహిళా పోలీసుల సేవలనుం కార్యాలయానికే పరిమితం చేయకుండా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు షీలీడ్స్ కార్యక్రమం అమలు చేస్తున్నాం. మహిళా బ్లూ కోల్ట్స్ బృందం వీధుల్లో తిరుగుతుంటే, తమకు రక్షణ ఉందనే ధైర్యం, ఆత్మవిశ్వాసం మహిళల్లో మరింత పెరుగుతుంది. ఈ శిక్షణ ద్వారా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది.



విద్యార్థిని చేతికి తీవ్ర గాయాలు

ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా ప్రమాదం

కోల్‌సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్‌లో సోమవారం సాయంత్రం ఓదెల మేఘన(16)అనే ఇంటర్ విద్యార్థిని బస్సు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడడంతో ఆమె చేయిపై నుంచి బస్సుటైర్ వెళ్లి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు. ఎన్‌టీపీసీ కృష్ణనగర్‌కు చెందిన మేఘన గోదావరిఖని శారదానగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్‌కళాశాలలో హెచ్ఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. గోదావరిఖని బస్టాండ్ నుంచి ఎఫ్‌సీఐలోని ఇంటికి వెళుతున్న సమయంలో కరీంనగర్-2 డిపోకు చెందిన బస్సు ఎక్కుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. గోదావరిఖని పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ జరిపారు.

ట్రాలీ - ద్విచక్ర వాహనం ఢీ

● ఒకరికి తీవ్ర గాయాలు

పెద్దపల్లి రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ శివారులో సోమవారం ట్రాలీ, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారునికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన అజయ్ ద్విచక్ర వాహనంపై పెద్దపల్లికి వస్తుండగా పెద్దపల్లి నుంచి మంథనికి వెళ్తున్న ట్రాలీ ఎదురెదురుగా ఢీకొంది. ట్రాలీ బోల్తాపడటంతో పాటు ద్విచక్రవాహన దారునికి తీవ్రగాయాలు కాగా పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. అతనితోపాటు ట్రాలీ డ్రైవర్‌కు గాయాలైనట్లు తెలిపారు. ఈ సంఘటనపై పెద్దపల్లి రూరల్ పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

కూతురి హత్య కేసులో తండ్రి అరెస్టు

కరీంనగర్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులైన కూతురి హత్య, కొడుకుపై హత్యాయత్నం కేసులో వారితండ్రి అనవేణి మల్లేష్(38)ని కరీంనగర్ త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ జాన్‌రెడ్డి సోమవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేటకు చెందిన అనవేణి మల్లేష్ 15ఏళ్లుగా నగరంలోని వావిలాలపల్లి వాసవినగర్‌లో నివాసం ఉంటున్నాడు. హమాలీ పనిచేసుకుంటూ భార్య పోసవ్వ, దివ్యాంగులైన కూతురు హర్షిత, కొడుకు హర్షిత్‌ను పోషించుకుంటున్నాడు. ఆ ఇద్దరు పిల్లలు చిన్నవయస్సు నుంచి మానసిక, శారీరక అంగ వైకల్యంతో బాధపడుతున్నారు. చికిత్సకోసం అనేక ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించారు. పిల్లల ఆరోగ్య, మానసిక పరిస్థితిలో మార్పు రాలేదు. పిల్లల పరిస్థితి జీవితాంతం మారదని వైద్యులు స్పష్టం చేయడంతో నిందితుడు తీవ్ర మానసిక ఆందోళనకు గురై ఘాతుకానికి పాల్పడ్డాడు.

● ఘటన జరిగిన తీరు..

ఈ నెల 15న మధ్యాహ్నం నిందితుడి భార్య మార్కెట్‌కు వెళ్లింది. ఆ సమయంలో మల్లేష్ మొదట కూల్‌డ్రింక్‌లో షుగుల మందు కలిపి పిల్లలకు ఇవ్వడానికి ప్రయత్నించగా వారు నిరాకరించారు. అనంతరం ఒక కాటన్ టవల్‌ను రెండు ముక్కలు చేసి వాటితో కూతురు(హర్షిత), కొడుకు (హర్షిత్) మెడకు ఉరివేశాడు. దీంతో కూతురు మరణించగా, కొడుకు స్పృహ కోల్పోయాడు. అనంతరం మల్లేష్ టవల్ ముక్కలను బయట పారేసి ఇంటినుంచి పారిపోయాడు. ఘటన తర్వాత నిందితుడు అదే సాయంత్రం కరీంనగర్ నుంచి హైదరాబాద్ జేబీఎస్‌కు చేరుకున్నాడు. అక్కడ లాడ్జిలో రూమ్ తీసుకున్నాడు. మరుసటి రోజు మంచిర్యాలకు వెళ్లి అక్కడ తిరుగుతూ పోలీసుల భయంతో తలదాచుకునే ప్రయత్నం చేశాడు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా సోమవారం ఉదయం కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న మల్లేష్‌ను అరెస్టు చేశారు. ఈ ఘటనపై కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. నిందితుడి మొబైల్‌ఫోన్, రెండు బస్‌టికెట్లు, హత్యకు ఉపయోగించిన రెండు కాటన్ టవల్ ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు, రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు.

బట్టల షాపులో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కోర్టుచౌరస్తా సమీపంలోని మహాలక్ష్మి ఫ్యాషన్‌మాల్‌లో సోమవారం వేకువజామున 3గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈప్రమాదంలో కోటి రూపాయల వరకు ఆస్తినష్టం జరిగిందని కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ రాజ్‌కుమార్ తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో షాపులో మంటలు అంటుకోగా స్థానికులు అందించిన సమాచారంతో కరీంనగర్ ఫైర్‌స్టేషన్ సిబ్బంది తెల్లవారు జామున 3 గంటలకు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కరీంనగర్, మానకొండూర్ ఫైర్‌ఇంజన్‌లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే షాపులో ఉన్న బట్టలు, ఫర్నిచర్, ఏసీలు దగ్ధమయ్యాయి. షాపు యజమాని సంగం రాజేశం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

లైంగిక దాడికి పాల్పడిన నిందితుడి అరెస్టు

సారంగాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): లైంగికదాడి చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల మేరకు సారంగాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఏడేళ్ల చిన్నారిపై అదే గ్రామానికి చెందిన బాపు(48) అనేవ్యక్తి బాలిక ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా ఇంట్లోకి తీసుకెళ్లి కొద్దిరోజుల క్రితం లైంగిక దాడికి పాల్పడ్డారు. దీంతో చిన్నారి ఏడ్చుకుంటు ఇంటికి వెళ్లగా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. జగిత్యాల సీఐ సుధాకర్, ఎస్ఐ గీత నిందితుడిని అరెస్ట్ చేసి పోక్సో కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆపదలో ఉన్న వ్యక్తిని ఆదుకున్న బ్లూకోల్ట్స్ సిబ్బంది

జ్యోతినగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్టీపీసీ ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద రోడ్డుపై ఓ వ్యక్తి పడి పోయాడు. దీంతో అక్కడివారు 100కు డయల్‌చేసి విషయం చెప్పగానే విధుల్లో ఉన్న బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ నవీన్ రావు అక్కడికి చేరుకుని, ప్రమాదవివరాలు సేకరించిబాధితుడిని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆపదలో ప్రజలు వందకు డయల్‌చేస్తే పోలీసులు అందుబాటులో ఉండి సేవలందిస్తారని ఎస్ఐ ఉదయ్‌కిరణ్ తెలిపారు. వెంటనే స్పందించి, బాధితుడిని ఆసుపత్రికి తరలించిన కానిస్టేబుల్‌ను ఎస్ఐ అభినందించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

కరీంనగర్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చల్లూరుకు చెందిన ఎండీ అహమ్మద్దీన్ ఏప్రిల్ 1న కరీంనగర్ రైల్వేస్టేషన్ వద్ద సెల్‌ఫోన్‌ను పోగొట్టుకొని కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ములుగులో ఉన్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రూరల్‌స్టేషన్‌లో సీఐ నిరంజన్‌రెడ్డి సెల్‌ఫోన్‌ను బాధితుడికి అందజేశారు.

ఫ్యాన్సీ నంబర్లు మరింత ప్రియం

● భారీగా రుసుమును పెంచిన ప్రభుత్వం

తిమ్మాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): లక్షలు వెచ్చించి వాహనాలు కొనుగోలు చేసిన వారిలో కొందరు వారికి కలిసి వచ్చే నంబర్లను దక్కించుకునేందుకు ఎంతైనా డబ్బులు వెచ్చిస్తారు. అవసరమైతే వేలంలో పాల్గొని అయిన వాటిని చేజిక్కించుకుంటారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నంబర్ల కేటాయింపుపై కీలక నిర్ణయం తీసుకుంది. వాహనాలకు ఇచ్చే ప్రత్యేక (ఫ్యాన్సీ) నంబర్ల రిజర్వేషన్ కోసం ప్రస్తుతం తీసుకుంటున్న రుసుమును భారీగా పెంచింది. తెలంగాణ మోటారు వాహనాల రూల్స్ 1989లోని నియామలు, నిబంధనలను సవరిస్తూ తుది నోటిఫికేషన్‌ను జారీ చేసింది. పెంచిన రెట్లు, నంబర్లను నోటిఫికేషన్‌లో పొందుపరిచింది.


తిమ్మాపూర్‌లోని జిల్లా రవాణా శాఖ కార్యాలయం

● నంబర్ల రిజర్వేషన్‌కు చెల్లించాల్సిన రుసుము

☑ 9999 నంబరు కావాలనుకునే వారు 1.5 లక్షల రూపాయలు చెల్లించి రిజర్వు చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో ఈ మొత్తం 50 వేలు రూపాయలుగా ఉండేది.

☑ 1, 9, 6666 ఈ నంబర్లు కావల్సిన వారు లక్ష రూపాయలు చెల్లించి రిజర్వు చేసుకోవాల్సి ఉంటుంది.

☑ 99, 999, 3333, 4444, 5555, 7777 నంబర్లు కావల్సిన వారు 50,000 రూపాయలు చెల్లించాలి.

☑ 5, 6, 7, 123, 333, 369, 555, 666, 777, 1111, 1116, 1234, 2222, 2277, 2345, 2727, 3339, 3366, 3456, 3699, 4455, 4545, 4599, 6669, 6789, 4455, 4545, 4599, 6669, 6789, 8055, 8888 నంబర్లు కావాల్సిన వారు 40 వేల రూపాయలు చెల్లించాలి.

(5) 3, 111, 234, 567, 1188, 1818, 1899, 1999, 2799, 3636, 3999, 5678, 5999, 6999, 7999, 9009 నంబర్లు కావాల్సిన వారు 30 వేల రూపాయలుచెల్లించాలి.

(6).2, 4, 8, 11, 18, 27, 36, 39, 45, 55, 77, 143, 222, 405, 444, 456, 459, 786, 789, 909, 1112, 1122, 1212, 1233, 1269, 1314, 1359, 1889, 2223, 2255, 2259, 2349, 2525, 3335, 3344, 3399, 3555, 3789, 3888, 3969, 4446, 4554, 4567, 4777, 4959, 5445, 5559, 5589, 5599, 5666, 5679, 5859, 6336, 6699, 6777, 6786, 6969, 7779, 7799, 7979, 8889, 8899, 8999, 9099 నంబర్లు కావాల్సిన వారు 20వేల రూపాయలు రుసుము చెల్లించి రిజర్వ్ చేసుకోవాలి.

ఇవి కాకుండా మిగతా ఏ నంబర్ కావాలన్నా ద్విచక్ర వాహనదారులు మూడు వేలు, కార్లు, ఇతర వాహనాదారులు ఆరు వేల రూపాయలు రుసుము చెల్లించి రిజర్వు చేసుకోవాల్సి ఉంటుంది.

● నిబంధనలు..

నంబర్ల రిజర్వేషన్‌కు సంబంధిత రవాణా శాఖ పోర్టల్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి.

☑ మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఆన్‌లైన్‌లో దాఖలు చేసిన బిడ్‌లను పరిశీలిస్తారు.

☑ ఒకే నంబరుకు ఒకటి కంటే ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుంటే వారిలో అత్యధిక బిడింగ్ వేసిన వారికి నంబర్‌ను కేటాయిస్తారు.

☑ దరఖాస్తుదారుడు బిడ్ సమర్పించకపోతే చెల్లించిన రుసుమును తిరిగి ఇవ్వరు. రిజర్వేషన్ చేసుకుని వేలంలో పాల్గొన్నా నంబర్ రాకపోతే కట్టిన రుసుములో 10శాతం మినహాయించుకుని మిగతా మొత్తాన్ని తిరిగి చెల్లిస్తారు.

ర్యాష్ డ్రైవింగ్.. మారని డ్రైవర్ల తీరు

● రోజుకో రోడ్డు ప్రమాదం
● పలువురికి గాయాలు


అన్నారం-లలితాపూర్ గ్రామాల మధ్య లోలెవల్ వంతెన దగ్గర ర్యాష్ డ్రైవింగ్‌తో వెలుతున్న బస్సు-లారీలు

మానకొండూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ర్యాష్ డ్రైవింగ్‌తో రోజుకో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంటోంది. కొంత మంది అమాయకులు ప్రాణాలు పోగొట్టుకుంటుండగా మరికొంతమంది గాయాలతో బయ టపడి నరకయాతన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఆర్టీసీ, లారీ డ్రైవర్ల తీరు మారడం లేదని ప్రయాణికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరీంగనర్-జమ్మికుంట ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సులు రోజుకు సుమారు 15ట్రిప్పులు ప్రయాణికులతో రాకపోకలు సాగిస్తాయి. దీంతోపాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు, వీణవంక, జమ్మికుంట మండలాలకు చెందిన పలు వాహనాలతో రోడ్డు రద్దీగా ఉంటుంది. దీనికి తోడు మండలంలోని ఊటూరులోని మానేరు వాగు, వీణవంక మండలంలోని కోర్కల్, మల్లారెడ్డిపల్లి తదితర గ్రామాల్లోని మానేరు వాగు నుంచి నిత్యం వందలాది ఇసుక లారీలు కరీంనగర్, సిద్దిపేట, వరంగల్, హైదరాబాద్ తదితర పట్టణాలకు తిరుగుతాయి. ఇసుక లారీలు పోటీ పడి ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. మండలంలోని అన్నారం-లలితాపూర్ గ్రామాల మధ్య లోలెవల్ వద్ద రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. అక్కడ రోడ్డు గుంతలమయంగా మారింది. అయినప్పటికీ సోమవారం ఇరువైపులా ఆర్టీసీ బస్సు-లారీ డ్రైవర్లు ఒకదాని వెనుక ఒకటి అతి వేగంతో పోటీ పడడం కనిపించింది. దీంతో బస్సులోని ప్రయాణికులు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం మండలంలోని సదాశివపల్లి బస్టాండ్ వద్ద ముందు ఉన్న లారీని వెనకాల నుంచి బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో సుమారు 15 మందికి గాయాలయ్యాయి. వేగంగా వెళ్లవద్దని విజ్ఞప్తి చేసినా సదరు ఆర్టీసీ డ్రైవర్ వినిపించుకోకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆరోపించారు.

పుస్తెల తాడు లాక్కెళ్లిన దొంగ అరెస్టు


దొంగను అరెస్ట్ చూపిస్తున్న టౌన్ సీఐ కృష్ణ

సిరిసిల్ల రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు లాక్కెళ్లిన దొంగను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్‌సీఐ కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దొంగను అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలోని మోహన్‌నగర్‌కు చెందిన గాదెరాణి అనే వృద్ధురాలు ఇంటిలో ఒక్కతే తలుపు దగ్గర పెట్టుకుని పడుకుని ఉండగా శాంతినగర్‌కుచెందిన మెరుగు భాస్కర్ అనేవ్యక్తి 15వతేదీన మధ్యాన్న సమయంలో తలుపులు తీసుకుని లోపలికి వచ్చి రాణి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడుతోపాటు రెండు గుండ్లు పట్టుకుని పారిపోయాడు. రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టి సీసీ కెమెరాల ఆధారంగా భాస్కర్ అనే దొంగను పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. దొంగించిన సొమ్మును అమ్ముకోగా వచ్చిన డబ్బులు జల్సాలకు వాడుకోగా మిగిలిన డబ్బులను సీజ్ చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

జమ్మికుంట రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలికకు మాయ మాటలు చెప్పి వివాహం చేసుకున్న ఓ యువకుడు ఆమెను గర్భిణిని చేసి ఇంటినుంచి బయటకు గెంటేయగా పోలీసులు అతడిపై పోక్సోకేసు నమోదు చేశారు. జయశంకర్ భూపాలపల్లిజిల్లా మొగుళ్లపల్లి మండలం పెద్ద కోమటిపల్లిలో చోటుచేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. జమ్మికుంట మండలం పాపక్కపల్లికి చెందిన బాలిక తండ్రి ఏడేళ్లక్రితం మృతిచెందాడు. అప్పటినుంచి తల్లితోపాటు అమ్మమ్మగారి ఊరైన పెద్ద కోమటిపల్లిలో ఉంటోంది. అదేగ్రామానికి చెందిన వంశీ సదరు బాలికకు మాయమాటలు చెప్పి ఈ ఏడాది మేలో పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నాడు. వివాహ సమయంలో కట్న, కానుకల కింద ఎకరం భూమి, నాలుగుతులాల బంగారం ఇచ్చారు. కొద్దినెలలు కలిసిఉన్న తర్వాత వారి మధ్య మనస్పర్ధలు వచ్చాయి. భర్తతోపాటు అత్తింటివారు అదనపు కట్నం కోసం వేధింపులకు దిగారు. పలుమార్లు పెద్దలసమక్షంలో పంచాయితీలు నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది. తనను మోసగించి వివాహం చేసుకొని గర్భిణిని చేశాడని బాలిక గ్రామపంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన కార్యదర్శి వెంటనే పోలీస్‌లకు ఫిర్యాదుచేశాడు. పోలీసులు పోక్సోచట్టం కింద యువకుడి పై కేసు నమోదు చేశారు. బాలికను సఖీ కేంద్రంలో చేర్పించారు.

రాత్రివేళ చెరువులో బావి తవ్వకం

● గ్రామస్థుల ఫిర్యాదుతో అడ్డుకున్న పోలీసులు

చందుర్తి నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓ మాజీ ప్రజాప్రతినిధి కుటుంబానికి చెందిన వ్యక్తి రాత్రివేళలో చెరువులో అక్రమంగా వ్యవసాయ బావి తవ్విస్తుండగా గ్రామస్థుల ఫిర్యాదుతో పోలీసులు అడ్డుకున్నారు. చందుర్తి మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులోని కొత్తచెరువులో సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. కొత్త చెరువులో బావిని తవ్వించేందుకు మూడు రోజుల క్రితం జేసీబీ ఏర్పాటు చేశారు. గ్రామస్థులు అడ్డుకోవడంతో పనులు నిలి పివేశారు. సోమవారం రాత్రి బావి తవ్వేందుకు పనులు ప్రారంభించగా పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి చేరుకొని పనులను నిలిపి వేశారు. చెరువులోనీరు ఉండటంతో ప్రస్తుతం తిమ్మాపూర్ ఆశిరెడ్డిపల్లి రామన్నపేట, అనంతపల్లి గ్రామాల్లో వ్యవసాయబావుల్లో, బోర్లలో నీటికొరత లేకుండా ఉంది. చెరువులో బావితవ్వడంతో భూగర్భజలాలు ఇంకిపోయి బోర్లు అడుగంటే ప్రమాదంపొంచి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై చందుర్తి తహసీల్దార్ భూపతిని వివరణ కోరగా చెరువులో బావి తవ్వడానికి ఎవరికీ అనుమతి ఇవ్వలేదని, చెరువుల్లో బావులు తవ్వరాదన్నారు. మంగళవారం బావిని తవ్వే ప్రాంతానికి సర్వేయర్‌ను పంపిస్తామని తెలిపారు.

పత్తి ఏరేందుకు వలస కూలీలు



నర్సక్కపేట గ్రామంలో పత్తి ఏరుతున్న ఆంధ్ర కూలీలు

● రైతుకు లాభదాయకం
● కర్నూలు కూలీలకు డిమాండ్

ఇల్లంతకుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పత్తి ఏరేందుకు ఇల్లంతకుంట మండలానికి ప్రతి యేటా ఏపీలోని కర్నూలు నుంచి కూలీలు వస్తుంటారు. మండలంలోని నర్సక్కపేట, జవారిపేట, గాలిపెల్లి, కేసన్నపల్లె, పత్తికుంటపల్లె, ఆరెపల్లి తదితర గ్రామాలలోని రైతులు ఎక్కువగా పత్తి సాగుచేస్తుంటారు. విత్తనాలు నాటిన నుంచి వర్షాలు వెంటాడటంతో పత్తి రైతులు కష్టాలు పెరిగిపోయాయి. పంటచేతికి అందివచ్చే దశలో మరోసారి కురిసిన వర్షాలతో పత్తి సాగు కష్టంగా మారింది. స్థానిక కూలీలు లభ్యం కాకపోవడం, కూలి, ఆటోకిరాయిలు కలుపుకొని ఒక్కొక్కరికి రూ. 450 వరకు ఖర్చు అవుతోంది. అయినా రోజుకు కేవలం 20కిలోలు మాత్రమే పత్తి ఏరుతున్నారని రైతులు వలస కూలీలను పత్తి ఏరేందుకు తీసుకువస్తున్నారు. ఈ యేడు ఏపీలోని కర్నూలు నుంచి 150మంది వలస కూలీలు నర్సక్కపేట గ్రామానికి చేరుకున్నారు. వారు నివాసం ఉండటానికి రైతుల కొట్టాలు ఇచ్చి విద్యుత్ సౌకర్యం కల్పించారు. వలస కూలీలు ఉదయం ఆరు గంటలకే చేనులోకి వెళ్లి సాయంత్రం ఆరు గంటల వరకు పత్తి ఏరుతారు. రైతులు కిలోకు రూ.15చెల్లించడమే కాకుండా ఆదివారం ఒక్కోకూలీకి పావుకిలో చికెన్ ఇస్తారు. వలస వచ్చిన కూలీలు ఎనమిది మంది కలిసి ఒక బ్యాచ్‌గా ఏర్పడి నివాసం ఉంటున్నారు. కర్నూలులో సరైన ఉపాధిలేక పోవడంతో వలస వచ్చామని వారు పేర్కొంటున్నారు. ప్రతిరోజు ఒక్కరు 50కిలోల వరకు పత్తి ఏరుతుంటారు. వర్షాల వల్ల పత్తి ఏరడం ఇబ్బందిగా మారిందని కూలీలు పేర్కొంటున్నరు. పత్తి ఏరడం పూర్తి అయిన తర్వాత సంక్రాంతికి ఇంటికి వెలుతామని పేర్కొంటున్నారు. వీరితో పాటు ఇప్పటికే పలు గ్రామాలలో ఉన్న బీహార్ కూలీలు కూడా పత్తి ఏరుతున్నారు.

పనిదొరక ఇక్కడికి వచ్చాం

- జగతపుగారి మాణిక్యమ్మ, కోటికల్, కర్నూలు



పుట్టిన ఊరును వదిలిపెట్టి రావడం బాధగా ఉన్నా అక్కడ పనిలేకపోవడంతో పత్తి ఏరడానికి వచ్చాం. రెండు నెలల పాటు పత్తి, మిరప ఏరిన తర్వాత సంక్రాంతికి ఇంటికి వెలుతాం. ఉదయం చేనులోకి వచ్చామంటే సాయంత్రం ఇంటికి వెలుతాం. కిలోకు రూ. 15చొప్పున రైతులు ఇస్తున్నారు. ప్రతి రోజు 50కిలోల పత్తి ఏరుతాం. కొట్టాలలో సరైన వసతులు లేకపోయినా సర్దుకుపోతున్నాం. కర్నూలు నుంచి వచ్చిన 150మందిమి నర్సక్కపేట గ్రామంలోనే ఉంటున్నాం.

కూలీ చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటాం

- ఏలియరాజా, పెద్దకడూరు, కర్నూలు



కూలీపని చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటాం. రెండు నెలలపాటు పత్తిఏరిన తర్వాత సంక్రాంతి పండుగకు ఇంటికి పోతాం. తర్వాత గుంటూరుకు మిర్చి ఏరడానికి పోతాం. పత్తి ఏరడమే కాకుండా ఇంటికి చేర్చే బాధ్యత కూడా మాదే. వర్షాలు పడటం వల్ల పత్తి ఏరడం కష్టంగా మారి సరైన కూలి పడటం లేదు. ప్రయాణ చార్జీలు రైతులే భరిస్తారు.

స్థానిక కూలీలు లభించకపోవడం వల్లనే

- కొత్త శ్రీనివాస్‌రెడ్డి, రైతు, నర్సక్కపేట



స్థానిక కూలీలు లభించకపోవడం వల్ల వలస కూలీలతో పత్తి ఏరిస్తున్నాం. స్థానిక కూలీలకు రూ. 350తోపాటు ఆటో కిరాయి ఇవ్వాల్సి ఉంటుంది. తక్కువ పత్తి ఏరడం వల్ల రైతులకు నష్టం జరుగుతుంది. వలస కూలీలు పత్తిని ఇంటివద్దకు చేరుస్తారు. వర్షాల వల్ల వలస కూలీల ధర కూడా పెరిగింది. ఈసారి పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. సీసీఐ నిబంధనలలో కొంత సడలింపు ఇవ్వాలి.

కుటుంబ కలహాలతో భర్తను హతమార్చిన భార్య

● తల్లి సహాయంతో గొంతుకు చున్నీ బిగించి హత్య

మల్లాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుటుంబకలహాలతో తల్లి సహాయంతో భర్తను హతమార్చిన ఘటన మల్లాపూర్ మండలం కొత్తదాంరాజుపల్లిలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మందపల్లి భూమేష్(31) అనే వ్యక్తిని అతడి భార్య విజయ తన తల్లి లక్ష్మితో కలిసి గొంతుకు చున్నీ బిగించి హత్య చేసింది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మెట్‌పల్లి అర్బన్ కాలనీకి చెందిన భూమేష్‌కు మల్లాపూర్ మండలం కొత్తదాంరాజుపల్లి గ్రామానికి చెందిన విజయతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. భూమేష్‌కు ఇది మొదటి వివాహం కాగా, భార్య విజయ్‌కు రెండో వివాహం. భూమేష్ మెట్‌పల్లిలో ఓ షాపులో పని చేస్తున్నాడు. కొంత కాలంగా భూమేష్ తాగుడుకు బానిసై ఇంట్లో ఖర్చులకు డబ్బులు ఇవ్వకపోవడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో విజయ కొన్ని నెలల క్రితం తల్లి గారి ఊరైన కొత్తదాంరాజుపల్లి గ్రామానికి వచ్చి గది కిరాయి తీసుకొని ఉంటోంది. తరువాత కొంత కాలానికి భార్య విజయ వద్దకు భూమేష్ వచ్చి కొత్తదాంరాజుపల్లిలోనే కలిసి ఉంటున్నారు. ఆదివారం మద్యం మత్తులో భూమేష్ తన భార్య విజయను కొడుతుండగా ఆమె తల్లి లక్ష్మి అడ్డుకుంది. దీంతో భూమేష్ అత్త లక్ష్మిపై దాడికి యత్నించాడు. దీంతో విసుగు చెందిన విజయ, ఆమె తల్లి లక్ష్మిలు కలిసి భూమేష్ గొంతుకు చున్నీ బిగించి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. భూమేష్ ఇంటి బయట వాకిట్లో పడి చనిపోయాడని చెప్పి బయట పడుకోబెట్టారు. భూమేష్ మృతదేహాన్ని చూసిన బంధువులు ఘటనపై అనుమానం వ్యక్తం చేశారు. అర్‌ఐ రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ



లక్ష్మీనరసింహాస్వామి సన్నిధిలో భక్తులు

ధర్మపురి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ సోమవారం పెరిగింది. దీంతో స్థానికలక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ శ్రీ రామలింగేశ్వస్వామి, శ్రీఅక్కపెల్లి రాజరాజేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండదీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఈవో సంకటాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కోటిలింగాలలో కాశీ శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా రుద్రాభిషేకం..

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఘనంగా రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో రామలింగేశ్వర స్వామికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు స్వామివారలను అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించి, దర్శనం చేసుకున్నారు.

కోటిలింగాలలో కార్తీక సందడి..

వెల్గటూర్: మండలంలోని కోటిలింగాలలో సోమవారం కార్తీక సందడి నెలకొన్నది. భక్తులు అధిక సంఖ్యలో గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వదిలారు. అనంతరం శ్రీపార్వతీ కోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. మహిళలు ఆలయప్రాంగణంలో కార్తీకదీపాలు వెలిగించారు. భక్తులు దీపదానాలు చేయగా ఆలయఅర్చకులు నాగరాజుశర్మ స్వీకరించారు.

ఆలయచైర్మన్ పూదరి రమేష్, ఈవో కాంతారెడ్డి భక్తులకు ఇబ్బంది కలుగకుండా చూశారు. ధర్మపురి సీఐ రాంనర్సింహా రెడ్డి స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ యోగా పోటీలు



అండర్-17 బాలుర విభాగంలో రన్నరప్ ట్రోఫీ అందుకుంటున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం వెలిచాల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న 69వ రాష్ట్రస్థాయి యోగా పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో తెలంగాణలోని ఉమ్మడి 10జిల్లాల నుంచి దాదాపు 240మంది క్రీడాకారులు పోటీపడ్డారు. గెలుపొందిన క్రీడాకారులకు వీర్ల హనుమంతరావు బహుమతులు ప్రదానం చేశారు. అండర్-17బాలికల విభాగంలో నిజామాబాద్ జిల్లా మొదటి, మెదక్‌జిల్లా రెండో, కరీంనగర్‌జిల్లా జట్టు మూడోస్థానం, బాలుర విభాగంలో ఆదిలాబాద్‌జిల్లా మొదటిస్థానం, కరీంనగర్‌జిల్లా రెండోస్థానం, వరంగల్‌జిల్లా మూడోస్థానం సాధించాయి. అండర్-14బాలికల విభాగంలో నిజామాబాద్ జిల్లా మొదటిస్థానం, కరీంనగర్ జిల్లా రెండోస్థానం, మెదక్ జిల్లా మూడవస్థానం, బాలుర విభాగంలో మెదక్‌జిల్లా మొదటిస్థానం, ఆదిలాబాద్‌జిల్లా రెండోస్థానం, కరీంనగర్‌జిల్లా జట్టు మూడోస్థానం సాధించాయి. అన్నివిభాగాల్లో ప్రథమస్థానంలో నిలిచిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు రాజరాజేశ్వరి, పీడీ దత్తాద్రి, గ్రామకార్యదర్శి శ్యామ్, ఎస్‌జీఎఫ్‌సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, వీర్‌పాల్‌రెడ్డి, శ్రీను, సత్యనారాయణ, రూపరాణి, రాజగోపాల్, రమేష్, హరికిషన్, రమణ, రాజ్‌కుమార్, పత్తి రాజిరెడ్డి, కృష్ణవేణి, స్వప్న, వనిత, అహ్మద్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థి ఎంపిక



ప్రశంసాపత్రంతో విద్యార్థి అమర్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం మధుమాలతీ, ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి పెద్దూరు అమర్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడని హెచ్‌ఎం మధుమాలతి సోమవారం తెలిపారు. హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో ఈ నెల 16న ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్(హైజంప్) అండర్- 14 విభాగంలో విద్యార్థి అమర్ అత్యంత ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. వచ్చే నెల 4 నుంచి 7 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి అమర్‌ను అభినందించారు. కార్యక్రమంలో పీడీ అక్బర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో సోమవారం నీటి మట్టం నిలకడగాఉంది.ఎగువప్రాంతం నుంచి 9,355 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తినీటినిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలకు గాను ప్రస్తుతం80.501టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టునుంచి 9,355 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో ఎస్కేప్ గేట్లద్వారా 8వేలక్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 650క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231క్యూసెక్కులు విడుదల అవుతోంది.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

శంకరపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మెట్‌పల్లి గ్రామ శివారులో పట్టుకున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. శంకరపట్నం మండలం గద్దపాకకు చెందిన జక్కుల అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ధర్మపురి, కోటిలింగాలలో వైభవంగా గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకొని ధర్మపురి వద్ద గోదావరి హారతి 27వరోజు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం లోక క్షేమార్థం, విశ్వశాంతి కోసం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి విశేష పూజలు నిర్వహించారు. రాత్రి వేళలో మహిళలు డొప్పలో దీపాలు వెలిగించి గోదావరినదిలో వదిలి పుణ్య ప్రాప్తి పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు.



ధర్మపురి వద్ద గోదావరి హారతి పూజలు

కోటిలింగాలలో..

వెల్గటూర్: కార్తీకమాసం పురస్కరించుకొని కోటిలింగాల వద్ద గోదావరి హారతి కార్యక్రమం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది, నాయకులు, భక్తులు, మహిళలు గోదావరినది వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లోక కల్యాణార్థం, విశ్వశాంతి కోసం ఆలయ అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మల మంత్రోచ్చరణల మధ్యగోదావరి మాతకు హారతి ఇచ్చారు. అంతకు ముందు శ్రీపార్వతీ కోటేశ్వరస్వామి వారికి పంచామృతాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు గోదావరి మాతకు పూజలు చేసి కార్తీకదీపాలు వెలిగించి గోదావరినదిలో వదిలారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి, ఆలయ ఈవో కాంతారెడ్డి, ఆలయ చైర్మన్ పూదరి రమేష్, గుమ్ముల వెంకటేష్, మెరుగు శ్రీనివాస్, గంద్ర శ్రీకాంత్ రావు, మహిళలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



కోటిలింగాలలో గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు

వేములవాడకు పోటెత్తిన భక్తులు

● స్వామివారిని దర్శించుకున్న 50వేలకు పైగా భక్తులు ● కోడె మొక్కుకు 3గంటల సమయం



భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ శ్రీభీమేశ్వరాలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి దాదాపు50 వేలకుపైగా భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించారు. స్వామివారికి కోడెల మొక్కులు చెల్లించేందుకు కనీసం మూడు గంటల సమయం పట్టింది. ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి ఇబ్బందుల పాలయ్యారు. భీమేశ్వరాలయానికి ఏ వైపు నుంచి వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఆలయంలో స్వామివారికి భక్తులు అభిషేకపూజలు చేశారు. నిత్య అన్నదానసత్రంపై అంతస్తులో కళ్యాణం, సత్యనారాయణ స్వామివ్రతాలు నిర్వహించారు. అనేకమంది భక్తులు స్వామి వారికి మహాలింగార్చన, కుంకుమ పూజలు, పెద్దపల్లకి సేవలు, ఆకు పూజలు చేసి భక్తి ప్రపత్తిని చాటారు. అనంతరం భీమేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఈవో రమాదేవి, డీఈఈ రఘునందన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. టౌన్‌సీఐ వీరప్రసాద్, ఎస్‌ఐ ఎల్లాగౌడ్, ట్రాఫిక్ ఎస్‌ఐ రాజులు 50మంది పోలీసులచే బందోబస్తు నిర్వహించారు. కార్తీకమాసం నాల్గవ సోమవారం సందర్భంగా శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి 11మంది రుత్వికులతో మహాన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకం, పరివారదేవతలకు అర్చనలు నిర్వహించారు. రాత్రి మహాలింగార్చన నిర్వహించారు.

ఎల్‌ఈడీ స్ర్కీన్‌పై రాజన్న దర్శనం

రాజరాజేశ్వరస్వామి ఆలయంలో విస్తరణపనులు జరుగుతున్న సందర్భంగా తాత్కాలికంగా స్వామివారి దర్శనాలు నిలిపివేయడంతో సోమవారం తూర్పువైపున ప్రచారరథంవద్ద ఏర్పరిచిన ఎల్‌ఈడీ స్ర్కీన్‌పై భక్తులు రాజన్నను దర్శించుకున్నారు.

బద్దిపోచమ్మకు బోనాలు..

భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్న భక్తులు బద్దిపోచమ్మకు బోనాలు సమర్పించారు. భక్తులతో బద్దిపోచమ్మ ఆలయం కిక్కిరిసిపోయింది. అమ్మవారి దర్శనానికి రెండుగంటలు పట్టింది. భక్తులు పురవీధుల్లో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనం సమర్పించారు.

● భక్తుల ఇబ్బందులు ..

స్వామివారి ఆర్జితసేవల టికెట్లకోసం పెద్ద ఎత్తున భక్తులు ముఖ్యబుకింగ్ కౌంటర్ వద్దకు చేరుకున్నారు. కల్యాణ ప్రాంగణం సామర్థ్యం దృష్ట్యా కేవలం 79 టికెట్లను మాత్రమే జారీచేయడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అసహనానికి గురైన భక్తులు ముఖ్యబుకింగ్ కౌంటర్ అద్దాలు ధ్వంసం చేశారు. కార్తీకసోమవారం కావడంతో వందలాది వాహనాలతో భక్తులు వేములవాడకు చేరుకున్నారు. గుడిచెరువు పార్కింగ్‌స్థలం వాహనాలతో నిండిపోయింది. భీమేశ్వరాలయంలో ముఖ్యబుకింగ్ కౌంటర్ వద్ద భక్తుల ఆందోళనతో ఆలయ ఈవో ఎల్. రమాదేవి తనిఖీలు నిర్వహించారు.



వేములవాడ పార్కింగ్‌లో వందలాది వాహనాలు

యాంటి బయోటిక్స్ అతి వినియోగంతో పశువులకు ముప్పు

జమ్మికుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యాంటి బయోటిక్స్ అతి వినియోగంతో పశువులకు ముప్పు వాటిల్లుతుందని విస్తరణ సంచాలకుడు డాక్టర్ కిషన్‌కుమార్ అన్నారు. సోమవారం పీవీనరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని మామునూరు, జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రాలు, సత్గురు మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ ఆధ్వర్యంలో పలు అంశాలపై కేవీకేలో రెండురోజుల శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాంటిబయోటిక్స్‌తో పశువులతో పాటు ప్రజలప్రాణాలకు ముప్పుతప్పదన్నారు. డాక్టర్‌వంశీకృష్ణ అధిక మోతాదులో వాడితే కలిగేనష్టాల గురించి రైతులకు శిక్షణ ఇచ్చారు. డాక్టర్ అంబిక పాకల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ ఎమ్ కిషన్ కుమార్, డాక్టర్ బిందుమాధురి, డాక్టర్ సాయికిరణ్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కిషన్ కుమార్

బీజేపీ ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ

కొడిమ్యాల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్ గ్రామ ఉన్నత పాఠశాలలో సోమవారం పదవ తరగతి విద్యార్థులకు మండల బీజేపీ నాయకులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పుట్టిన రోజును సందర్భంగా మోడీ గిఫ్ట్ సైకిళ్ళను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు బండ నర్సింహరెడ్డి, చల్ల శ్రీనివాస్‌రెడ్డి, కదారి మల్లేశం, వడ్లకొండ నర్సయ్య, ప్రభాకర్‌రెడ్డి హరీష్, రవి, బాలరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

మల్లాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలాభివృద్ధికి పరస్పర సహకారంతో ముందుకెళుదామని ఎంపీడీవో శ్రీకాంత్ అన్నారు. సోమవారం మల్లాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో కిసాన్‌సెల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ జలపతిరెడ్డి పార్టీ నాయకులతో కలిసి ఎంపీడీవో శ్రీకాంత్‌ను శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పరస్పర సహకారంతో అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగవంతంగా జరిగేటట్లు లబ్ధిదారులకు సూచించాలని పార్టీ నాయకులకు ఎంపీడీవో సూచించారు. జరుగుతున్న అభివృద్ధి పనులను చర్చించిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, మాజీ సర్పంచ్ బాపురెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం షైపాల్, రాఘవులు, గొండ రాజేందర్, నర్సయ్య ఆనంద్‌గౌడ్, సురేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను వేధిస్తున్న వారసులపై ఫిర్యాదు

జగిత్యాల అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను వేధిస్తున్న వారసులపై సీనియర్ సిటీజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ సాయంతో పలువురు బాధితులు జగిత్యాల ఆర్డీఓ పులి మధుసూదన్‌కు ఫిర్యాదు చేశారు. జగిత్యాల మండలం పొలాస గ్రామానికి చెందిన గుగ్గిల్ల నర్సవ్వ (80) అనే వృద్ధురాలిని ఆమె కొడుకు, కోడలు తన స్వఇంటి నుంచి కొట్టి గెంటి వేశారని, రాయికల్ మండలం చింత లూర్‌కు చెందిన అనుపురం నాగయ్య గంగవ్వ అనే వృద్ధ దంపతులను రెండో కుమారుడు పోషించకుండా తండ్రి పేరిట ఉన్న భూములను తన పేరిట పట్టా చేయాలని తరుచు దాడి చేస్తున్నాడని ఫిర్యాదు చేశారు. అనంతరం ఎస్పీ కార్యాలయానికి వెళ్ళి ఫిర్యాదు చేశామని బాధితులు తెలిపారు. వారి వెంట సీనియర్ సిటీజన్స్ ప్రతినిధులు పి. హన్మంత రెడ్డి, గొరిశెట్టి విశ్వనాథం, రాధ, కరుణ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో జిల్లా వాసుల ధర్నా

జగిత్యాల అర్బన్, నవంబర్ 17(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సోమవారం జరిగిన ధర్నాలో జగిత్యాల జిల్లా కు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ పిలుపు మేరకు ధర్నా చేపట్టిన సంగతి తెలిసిందే ధర్నాలో జగిత్యాల జిల్లా మాదిగ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు దూమాల గంగారాం, వర్కింగ్ ప్రెసిడెంట్ చెటిపెల్లి లక్ష్మణ్, శనిగారపు మురళీకృష్ణ, బెజ్జంకి సతీష్, బోనగిరి కిషన్, చిన్న కుమారస్వామి తదితరులు ఉన్నారు.

‘పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి’


విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకురాలు సులోచన

జగిత్యాలరూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు, మోడల్ స్కూల్స్ అసిస్టెంట్ డైరెక్టర్ కె. సులోచన అన్నారు. స్పెషల్ క్యాంపెయిన్ 5.0 లో భాగంగా జగిత్యాల రూరల్ మండలంలోని పీఎం శ్రీ కండ్లపల్లి మోడల్ స్కూల్‌ను సులోచన సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాల పరిసరాలు, లైబ్రరీ, సైన్స్‌ల్యాబ్‌లు, కిచెన్ గార్డెన్‌లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయులు అందిస్తున్న బోధన తీరును అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సరితాదేవి, వైస్ ప్రిన్సిపాల్ నాగేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●మల్యాల: మండలం లోని ముత్యంపేట జడ్పీ ఉన్నత పాఠశాల, మల్యాలలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంను సోమవారం విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు సులోచన సందర్శించారు. స్పెషల్ క్యాంపెయిన్ 5.0లో భాగంగా అందులోని అంశాలను ఆయా పాఠశాలల్లో పరిశీలించారు. తరగతి గదులు, గ్రంథాలయం, ల్యాబ్, వంట గదుల పరిసరాలు, మరుగుదొడ్లు, ఆట స్థలాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి రోజు పాఠశాలల్లో ఉపాధ్యాయులు వాటిని తనిఖీ చేస్తూ శుభ్రంగా ఉండేలా చూడలన్నారు. రాష్ట్ర పరిశీలకుల వెంట మండల విద్యాధికారి ఎన్.జయసింహరావు, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

●కొడిమ్యాల: పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకురాలు సులోచన మోడల్ స్కూల్ ఏడీ అన్నారు. సోమవారం మండలంలోని పూడూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులలో విద్యార్థుల వద్దకు వెళ్లి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. విద్యార్థులు చదువుతున్న తీరును గమనించారు. పాఠశాల మైదానం, వంటగది, కిచెన్‌గార్డు, లైబ్రెరీ, రన్నింగ్ వాటర్, హ్యాండ్‌వాష్ పాయింట్, డైనింగ్ హాల్‌ను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేసారు. అనంతరం మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ పరిశీలనలో పాఠశాలకు సంబంధించిన పలు విషయాలను ప్రధానోపాధ్యాయుడు టి. శ్రీనివాసరాజును అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర పరిశీలకురాలు వెంట సెక్టోరియల్ ఆఫీసర్ మహేష్ ఉన్నారు.

ప్రభుత్వ కళాశాల నిధులు రూ.17 లక్షలు స్వాహా

-ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం -ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు మెమో జారీ

కోరుట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజ్ మిని డిపాజిట్ నిధులు స్వాహా చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల నుంచి ఫీజుల రూపంలో 30 సంవత్సరాలకు పైగా సేకరించిన రూ.17 లక్షల సీఎండీ నిధులు కళాశాలకు చెందిన బ్యాంక్ అకౌంట్‌లో డిపాజిట్ అయి ఉన్నాయి. నిధులను కాలేజీ నిర్వహణ, ల్యాబ్, పారిశుధ్య పనులతో పాటు పలు అవసరాలకు వాడుతుంటారు. అట్టి నిధులను కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకున్న ఇమ్రాన్ ఖాన్ వ్యక్తిగత అవసరాల కోసం వాడుకున్నట్లు వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గౌసూర్ రహ్మాన్ ఆరు నెలల క్రితం అమెరికాకు సెలవు పెట్టి వెళ్లాడు. 2025 సంవత్సరం జూలై 11 నుంచి అక్టోబర్ 25 వరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఇమ్రాన్ ఖాన్ అనే హిందీ ఉపన్యాసకుడిని నియమించింది. ఇమ్రాన్ ఖాన్ విడతల వారీగా కళాశాల అకౌంట్‌లో నుంచి రూ. 17 లక్షల నిధులను వ్యక్తి అవసరాల కోసం డ్రా చేసినట్లు తెలిసింది. విదేశాల నుంచి తిరిగి వచ్చి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకున్న గౌసూర్ రహ్మాన్ బ్యాంక్ అకౌంట్‌కు సంబంధించిన స్టేట్‌మెంట్ తీసుకున్నాడు. దీంతో బ్యాంకు అకౌంట్‌లో ఉన్న డబ్బులు డ్రా చేసి ఉన్నట్లు గుర్తించాడు. బ్యాంకులో డిపాజిట్ చేసిన నిధులు రూ.17 లక్షల వరకు డ్రా చేసినట్లు గుర్తించాడు.

వెంటనే విషయంపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను ఇమ్రాన్‌ఖాన్ నిలదీసాడు. వ్యక్తిగత అవసరాల కోసం తానే నిధులు వాడుకున్నట్లు ఇమ్రాన్‌ఖాన్ ఒప్పుకోవడంతో ప్రిన్సిపాల్ జిల్లా ఇంటర్మీడియెట్ అధికారికి ఫిర్యాదు చేశాడు. కళాశాలకు వచ్చిన డీఐఈవో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు మెమో జారీ చేసారు. సంబంధిత విషయంపై ఆర్‌జేడి, కమీషనర్‌కు నివేదిక అందజేసినట్లు తెలిసింది. ఇమ్రాన్‌ఖాన్ కాలేజీ ఖాతాలో రూ.9లక్షలను ఇటీవల జమ చేశాడు. మిగితా డబ్బులు త్వరలో చెల్లిసానని ప్రిన్సిపాల్‌కు తెలిపినట్లు సమాచారం. ఈ విషయంపై ప్రిన్సిపాల్ గౌసూర్ రహమాన్‌ను వివరణ కోరాగా డబ్బులు గల్లంతైన విషయం నిజమేనని ఈ విషయంపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జగిత్యాల అర్బన్ పీఎంశ్రీ ధరూర్ క్యాంప్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళాభివృద్ధి శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం చైల్డ్‌లైన్ 1098 అధికారి కేస్‌వర్కర్ రజిత విద్యార్థులకు బాల్యవివాహచట్టం-2006, పోక్సోచట్టం-2012, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరం అని, అందుకు రెండేళ్ల జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధించ బడుతుందన్నారు. బాల్యవివాహాల వల్ల పిల్లలకు భవిష్య త్తులో వచ్చే మానసిక, శారీరక ఎదుగుదల ఆగిపో తుందన్నారు. 18ఏళ్ల బాలబాలికల రక్షణ, సంరక్షణ అవసరమైన పిల్లలకు 24గంటలు పనిచేసే ఉచిత అత్యవసర ఫోన్ సేవా సౌకర్యం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, డయల్ 100 సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాల్యవివాహాలు లేని భారతదేశం కోసం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం యాళ్ల అమర్నాథ్‌రెడ్డి, ఐసీడీఎస్ స్వరూపారాణి, సహాయ ఎన్‌జీవో లహరి, అంగన్వాడీ టీచర్ శ్యామల, ఆశావర్కర్ అంజలి, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీదేవి, శ్రీలత, గంగయ్య, పవన్, షకీల్, ప్రభాకర్, కిరణ్ తో పాటు విద్యార్థులున్నారు.

●భీమారం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం బాల్య వివాహాల నిరోధక చట్టం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా 18 సంవత్సరాల్లోపు అమ్మాయిలకు, 21 ఏళ్లలోపు అమ్మాయిలకు వివాహం జరిపితే వెంటనే 1098 కు కాల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ చైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ శ్రవణ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, కార్యదర్శి లక్ష్మి, సహాయ వెల్ఫేర్ కౌన్సిలర్ లత, హైస్కూల్ హెచ్‌ఎం జవ్వాజి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల సందర్శన

ఇబ్రహీంపట్నం, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మక్కపేట్, డబ్బా, ఎర్రపూర్ తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న వడ్ల కొనుగోలు కేంద్రాలను పలువురు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సోమవారం సందర్శించారు. ఈ మేరకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. వారికి అవసరమైన సదుపాయాల కల్పన చేయాలని, తేమ వచ్చినవెంటనే ధాన్యం తూకం వేసి మిల్లులకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు, ఇబ్రహీంపట్నం ఏఎంసీ వైస్ చైర్మన్ ఎల్లాల వెంకట్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బూస రాజేశ్వర్, దేశెట్టి జీవన్, కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి, కొమ్ముల చిన్నరెడ్డి, కాశిరెడ్డి శేఖర్‌రెడ్డి, తిమ్మని రాములు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

మల్యాల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వాపూర్‌కు చెందిన బొద్దుల లక్ష్మీనారాయణ అనే వ్యక్తి అదృశ్యం అయినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లిన లక్ష్మీనారాయణ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పలు చోట్ల గాలించారు. అయినప్పటికీ అతని ఆచూకీ లభించక పోవడంతో సోమవారం లక్ష్మీనారాయణ తమ్ముడు బొద్దుల మల్లేశం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

పెగడపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటుకు హిందూ ధర్మరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం భూమిపూజ చేశారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సమీపంలోని మూలమలుపులో విగ్రహం ఏర్పాటుకు నిశ్చయించి, సోమవారం శాస్త్రోక్తంగా భూమి పూజ చేసి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నిర్మాణ కమిటీ అధ్యక్షులు ఉయ్యాల రాజశేఖర్, ఉపాధ్యక్షులు నేదరి సాయికృష్ణ, పాదం కార్తీక్, మాదారపు కార్తీక్, సుధాకర్, కార్యదర్శి ఉల్లెందుల రాజశేఖర్, గంగాసాగర్, జక్కుల మల్లేశం, బొమ్మెన సుధాకర్, కొత్తకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

యాసంగి రుణ లక్ష్యం ఖరారు

(ఐదో పేజీ తరువాయి)

(ఐదో పేజీ తరువాయి)

ఇప్పటికే ఆరంభం అయింది. చాలా చోట్ల ఇప్పటికే దుక్కులు దున్ని భూమిని సాగుకు సిద్ధం చేశారు. పలు చోట్ల నారుమడులు సైతం వేస్తున్నారు. ఈ సమయంలో పంట పెట్టు బడులకు రైతుకు డబ్బులు అవసరం అవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో పంట పెట్టుబడులకు బ్యాంకులు అందించే రుణాలపైనే ఆధారపడతారు. బ్యాంకర్లు సకాలంలో రుణాలు అందిస్తేనే రైతులకు ప్రయో జనం కలుగుతుంది.

ప్రైవేటు అప్పులతో వడ్డీల భారం..

బ్యాంకులు రుణాలు అందించకపోతే రైతులు అధి క వడ్డీలకు ప్రైవేటుగా అప్పులు చేస్తారు. దీంతో ఆర్థికంగా నష్టపోతుంటారు. పంటల దిగుబడి సరిగా రాకపోతే రైతులు ప్రైవేటుగా తీసుకున్న అప్పులకు వడ్డీ మాత్రమే చెల్లిస్తారు. అసలు అలాగే ఉండి నెలల తరబడి వడ్డీలు చెల్లిస్తూ ఆర్థికంగా బలహీన పడిపోయే పరిస్థితులు ఉంటాయి. వీటిన్నంటిని దృష్టిలో పెట్టుకొని బ్యాంకులు సకాలంలో రుణాలు అందించి రైతులు కోరుతున్నారు.

దుబ్బరాజన్న ఆలయంలో డీఎస్పీ దంపతుల పూజలు

సారంగాపూర్, నవంబర్, 17 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ దుబ్బరాజన్న ఆలయంలో కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకుని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ దంపతులు స్వామి వారి దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసంధర్బంగా ఆలయ అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు కైలాసం స్వామి వారి శేష వస్త్రంతో సన్మానించి తీర్థ ప్రసాదాలను అందించ జేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గీత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరమైన చెట్ల తొలగింపు

భీమారం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలం లోని రంగాపూర్ గ్రామ వరద కాలువ బ్రిడ్జి వద్ద మూల మలుపుపై ప్రమాదకరంగా ఉన్న చెట్లు, పిచ్చి మొక్కలను సోమవారం ఫీల్డ్ ఆఫీసర్ తొలగించారు. ప్రమాదకరంగా ఉన్న మూల మలుపును, చెట్ల తొలగింపు కార్యక్రమాన్ని ఎస్సై శ్రీధర్ రెడ్డి పరిశీలించి తగు సూచనలు చేశారు. ప్రమాదకర మలుపు ఉన్నందున వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలని, మూల మలుపుల వద్ద వేగంగా వెళ్లవద్దని సూచించారు. గ్రామ పోలీస్ ఆఫీసర్ సత్తయ్య పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

భీమారం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంలో సోమవారం లక్ష్మీ నృసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాప నోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థాపకులు చిలువేరి బ్రదర్స్, ఎస్సై శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువ మరమ్మతుకు నిధులు మంజూరు


మాట్లాడుతున్న కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు జలపతిరెడ్డి

మల్లాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్సారెస్పీ డీ 29 కాలువల మరమతులకు కోరుట్ల నియోజక వర్గం కాంగ్రెస్ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు కృషితో రూ. 13.50లక్షలు నిధులు మంజూరైనట్లు పార్టీ నాయకులు ఎలాల జలపతిరెడ్డి సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయకట్టు రైతుల విజ్ఞప్తి మేరకు జువ్వాడి నర్సింగరావు సంబంధించిన మంత్రితో చర్చించి నెలకొన్న సాగు నీటి ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు జలపతిరెడ్డి వివరించారు. నిధులు మంజూరికి కృషి చేసిన ఉత్తమకుమార్‌రెడ్డికి, జువ్వాడి బ్రదర్స్‌లకు మల్లాపూర్ మండల రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లరాజన్న, నర్సారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవులు, సురేష్, గడ్డం షైపాల్‌రెడ్డి, లక్‌పతిరెడ్డి, రమేష్, ఆనంద్‌గౌడ్, భూమయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వన భోజనాలు

ధర్మపురి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని నేరెళ్ల సాంబశివుడి ఆలయం వద్ద ధర్మపురి యోగా నిత్య సాధన కమిటీ ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి క్షేత్రానికి చెందిన యోగా నిత్య సాధన కమిటీ ఆధ్వర్యంలో సభ్యులు సాంబ శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మపురి యోగా నిత్య సాధన కమిటీ ఇన్‌స్ట్రక్టర్ పెద్ది శివకుమార్, సంగి మంజుల, గొల్లపెల్లి సుమలత, రంగ శంకరయ్య, సామాజిక సేవకుడు రేణికుంట రమేష్, చీపిరిశెట్టి నరేష్, ఆకుల రవీందర్, సత్యం, భాస్కర్, సోమిశెట్టి స్వాతి, సిరుప భవాని, రంగ మంజుల, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి మృతి



కరీంనగర్ క్రైం, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐ ఎఫ్‌బీ)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి (60) కరీంనగర్ హౌసింగ్ బోర్డు కాలనీలో తన స్వగృహంలో సోమవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన కొంతకాలంగా కిడ్నీ సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. సురేందర్‌రెడ్డిది జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం పూడూరు స్వగ్రామం కాగా కరీంనగర్‌లో స్థిరపడ్డారు. ఆయన 2011 నుంచి 2014 వరకు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్(ఏఐఎఫ్‌బీ) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత 2014 నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగారు. 2023లో జాతీయ కార్యదర్శిగా పనిచేశారు. చాలా మంది రాజ కీయ నాయకులకు తన పార్టీ తరఫున సింహం గుర్తుతో ఎన్నికల్లో టికెట్ ఇచ్చి ఆశ్రయం కల్పించారు. అందరూ ఆయనను సింహం సురేందరన్న అంటూ అభిమానంగా పిలుచు కుంటుండేవారు. బండ సురేం దర్‌రెడ్డికి భార్య, కూతురు ఉ న్నారు. బండ సురేందర్‌రెడ్డి మరణంపై పలువురు రాజకీయ పార్టీల నాయకులు సంతాపాన్ని తెలిపారు. ఏఐఎఫ్‌బీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి మృతి చెందటంపట్ల మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ సంతాపం తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న సురేం దర్‌రెడ్డి సోమవారం తుది శ్వాస విడవడం విచారకరమన్నారు. పా ర్టీకి, ప్రజాసేవకు ఆ యన చేసిన కృషి చిర స్మరణీ యమని పేర్కొ న్నారు. సురేందర్ రెడ్డి కుటుంబ సభ్యులకు వినోద్‌కుమార్ సానుభూ తిని తెలిపారు.

కేతేశ్వరస్వామి జాతర

కథలాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలంలోని అంబారిపేటలో జరుగుతున్న కేతేశ్వర - కంకాలమ్మ జాతర ముగింపు ఉత్సవాలకు సోమవారం వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్థానిక అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పంచామృత అభిషేకాలు, కుంకుమార్చన, స్వామి వారి అలం కరణ, భక్తులకు అన్నదాన ప్రసాద కార్యక్రమాలు నిర్వాహకులు చేశారు. ఈ సందర్బంగా జవ్వాజి రవి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మేదరి సంఘం సభ్యులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి

కోరుట్ల రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. సోమవారం మండలంలోని జోగినిపల్లి గ్రామంలో ప్రభుత్వం మంజూరి చేసిన ఇందిరమ్మ నిధులతో నిర్మాణం చేసిన ఇంటిని స్థానిక నాయకులతో కలిసి గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి దిశగా నడిపించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నాడని అన్నారు. జూబ్లీ హిల్స్ జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయంను స్వాగతిస్తూ సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ వన్నాల అంజిరెడ్డి, నాయకులు మహిపాల్‌రెడ్డి, పెరమాండ్ల సత్యనారాయణ, బిట్టు, సహదేవ్, ఇంద్రాల హరీష్, అశోక్, సైదు గంగాధర్, బల్వంత రెడ్డి పాల్గొన్నారు.

‘ప్రజావాణిలో సమస్యల సత్వర పరిష్కారం’


దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. జగిత్యాల కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 24 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల సత్వర పరిష్కారానికి మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని సుదూర ప్రాంతాలనుంచి ఎంతో శ్రమ కోర్చి ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు తమ సమస్యలను పరిష్కరించి ఫలితాన్ని అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు బిఎస్ లత, రాజాగౌడ్, ఆర్డీఓలు పులి మధు సూదన్, నక్క శ్రీనివాస్, జీవాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యావర్ రోడ్డును విస్తరించాలి

-బీజేపీ నాయకులు

జగిత్యాల పట్టణంలో ప్రమాదకరంగా మారిన యావర్ రోడ్డును వెంటనే ప్రభుత్వం చొరవ తీసుకుని వెడల్పు చేయాలి. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని గగ్గోలు పెడుతున్న జీవన్ రెడ్డి నాలుగు దశాబ్దాలుగా ఏం చేశాడు. జిల్లా డిఫాల్ట్ ఉన్న రైస్ మిల్లర్ల పై చర్యలు తీసుకోవాలి. జిల్లా వ్యాప్తంగా రైస్‌మిల్లర్లు గోల్‌మాల్ చేసిన 32కోట్ల రూపాయలు వెంటనే వారి వద్ద నుంచి వసూలు చేయాలి.

ఈత చెట్లను తొలగించేందుకు కుట్ర

- గీత కార్మికులు, బొమ్మెన

1984 ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గీతా కార్మికులకు ఈత చెట్లు పెంచుకోవడానికి ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఇచ్చారు. అయితే ఆ తర్వాత చాలా రోజుల తర్వాత తాము అందులో ఈత చెట్లను పెట్టి పెంచుకుంటున్నాము. ఆ స్థలాన్ని కబ్జా చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారు. భూమి కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలి.

వెల్గటూర్ ఎస్సైగా ఉదయ్ కుమార్

వెల్గటూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ నూతన ఎస్సైగా ఉదయ్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహించిన ఉమాసాగర్ జగిత్యాల రూరల్ మండలానికి బదిలీ అయ్యారు. ధర్మపురి ఎస్సైగా విధులు నిర్వహించిన ఉదయ్ కుమార్‌ను వెల్గటూర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ అశోక్ కుమార్ ఉత్తర్వులు జారీ చేయడంతో బాధ్యతలు చేపట్టారు. కాగా అంతకు ముందు ఆయన శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై ఉదయ్ కుమార్‌ను సోమవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గూడ రాంరెడ్డి, గేల్ల తిరుపతి, పూదరి రమేష్, మేరుగు మురళి, సందీప్‌రెడ్డి, ఉదయ్, తిరుపతి, మంజుల, లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి


ధాన్యం తేమను పరిశీలిస్తున్న ఏపీఎం

కథలాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోళ్ళు వేగవంతం చేయాలని ఏపీఎం చిన్నరాజయ్య సూచించారు. సోమవారం మండలంలోని భూషణరావుపేట, పెగ్గెర్ల గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్ణీత తేమ, డాటా ఎంట్రీ, గన్నీ సంచుల స్టాక్, రైతులకు కేంద్రాల్లో వసతులు వంటి అంశాలను పరిశీలించారు. కాగా ఇప్పటివరకు 12 కేంద్రాల్లో 30 వేల క్వింటాళ్ళ ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. పెగ్గెర్ల, సిరికొండ గ్రామాల్లో సన్నరకం వడ్లు తెచ్చారని జిల్లా అధికారులతో మాట్లాడి మిల్లు కేటాయింపుకు ప్రయత్నిను _న్నామని పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ధర్మపురి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ధర్మపురి ఏఎంసీ ఛైర్‌పర్సన్ చిలుముల లావణ్య కోరారు. ధర్మపురి మండలంలోని దొనూర్, తీగలధర్మారం గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుక వచ్చి మద్దతు ధర పొందాలని అన్నారు. కార్యక్రమంలో ధర్మపురి ఏఎంసీ వైస్ చైర్మన్ సంగ నర్సింహులు, మాజీ సర్పంచులు కొండపెల్లి సువర్ణ-ప్రకాష్‌రావు, జంగిలి ప్రభాకర్, ముత్యం గంగారాం, దాసరి పురుషోత్తం, వేముల రఘుపతిరెడ్డి, చిరుత శ్యాంసుందర్, పందిరి అశోక్, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

మెట్‌పల్లి టౌన్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన 108, 102 అంబులెన్స్ వాహనాలను సోమవారం జిల్లా ప్రోగాం మేనేజర్ యశోద ఐలయ్య ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అత్యవసర సమయంలో వినియోగించే పరికరాల పనితీరు, సంబంధిత రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. రోడ్డు యాక్సిడెంట్లు, గర్భిణీలు, పాముకాటు తదితర అత్యవసర సేవలకు 108 అంబులెన్సులను మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఆయనవెంట ఈఎంటీ మోహన్, పైలెట్ రంజిత్, వినోద్‌లు ఉన్నారు.

యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా కొమురెల్లి

పెగడపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : యాదవ సంఘం పెగడపల్లి మండల అధ్యక్షుడుగా మండల కేంద్రానికి చెందిన గంగుల కొమురెల్లి ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. సోమవారం యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు పలుమారు మల్లేశ్ యాదవ్ సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గౌర వాధ్యక్షు లుగా పలుమారు విజయ్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా బల్మం కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా నెత్రట్ల రాజేశం, మారం కొమురయ్య, కనకయ్య, వీరేశం యాదవ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బినవేని ముకేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు బండ మల్లేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల ప్రత్యేక పూజలు

మల్యాల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో మల్యాల మండల కేంద్రంలోని శివాలయం భక్తులతో కిటకిటలాడింది. శివాలయంలో వందలాది భక్తులు శివున్ని దర్శించుకొని పూజలు నిర్వహించారు. రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించారు.